నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ గురువారం 24 అక్టోబర్ 2024 | ADILABAD NIRMAL





సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

## కాంగ్రెస్ వైఫల్యాలపై

# రణభేరి

**నేడు జిల్లాకు యువనేత కేటీఆర్ రాక**

- రైతు సమస్యలపై ఆందోళన సభకు హాజరు
- రాంలీలా మైదానంలో భారీ బహిరంగ సభ
- ఏర్పాట్లను పరిశీలించిన మాజీ మంత్రి రామన్న

ఆదిలాబాద్, అక్టోబర్ 23(నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) రణభేరి మోగిస్తున్నది. ఇందులో భాగంగా నేడు(గురువారం) ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిరసన సభ ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, యువనేత కేటీఆర్ హాజరుకానున్నారు. రాంలీలా మైదానంలో ఉదయం 10 గంటలకు సభ ప్రారంభంకానుండగా.. కేటీఆర్ హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గాన ఆదిలాబాద్‌కు వస్తారు. నిరసన సభకు బీఆర్ఎస్ నాయకులు అన్ని ఏర్పాట్లు చేశారు. మాజీ మంత్రి జోగు రామన్న ఆధ్వర్యంలో సభ జరుగుతుండగా.. ఆదిలాబాద్ నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో రైతులు, ప్రజలు హాజరుకానున్నారు. మంగళవారం సభా ఏర్పాట్లను మాజీ మంత్రి జోగు రామన్న పరిశీలించి సూచనలు చేశారు. సభ నిర్వహణలో భాగంగా బీఆర్ఎస్ శ్రేణులు వారం రోజులుగా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రూ.2 లక్షల రుణమాఫీతోపాటు రైతుభరోసా, ఆరు గ్యారెంటీలను అమలు చేయడంతో వైఫల్యం చెందడాన్ని ప్రజలకు వివరించారు. ఈ నిరసన సభలో కేటీఆర్ కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టనున్నారు. సభ సందర్భంగా పట్టణాన్ని బీఆర్ఎస్ జెండాలతో గులాబీమయంగా తీర్చిదిద్దారు. యువనేతకు స్వాగతం పలకడానికి ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఏర్పా టు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ పది నెలల పాలనపై ఆగ్రహంతో ఉన్న రైతులు, ప్రజలు ఈ సభకు భారీ సంఖ్యలో హాజరుకానున్నారు.

### కాంగ్రెస్ వైఫల్యాలపై ఆగ్రహం

కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన రుణమాఫీ, రైతుభరోసా విషయంలో ఆదిలాబాద్ జిల్లా రైతులు ఆగ్రహంతో ఉన్నారు. జిల్లాలో 1.35 లక్షల రైతులకు బ్యాంకు రుణాలు ఉండగా.. కేవలం 55 వేల మందికి రూ.600 కోట్లను మాఫీ చేసినట్లు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వం సూచించిన విధంగా రూ.2 లక్షల లోపు బ్యాంక్ లోన్ ఉన్న చాలా మంది రైతులకు మాఫీ జరగలేదు. తమ బ్యాంకు అప్పులు రద్దు చేయాలంటూ జిల్లా వ్యాప్తంగా రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళనలు చేపట్టారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలతో శవయాత్రలు నిర్వహించారు. తమ రుణాలు మాఫీ చేయాలంటూ మూడు నెలల నుంచి అధికారులు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదు. జిల్లాలో 1.40 లక్షల మంది రైతులకు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి సీజన్‌లో రూ.260 కోట్లను రైతుబంధు పథకంలో భాగంగా అందజేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా పథకంలో భాగంగా ఎకరాకు రూ.10 వేలు అందజేస్తామని ప్రకటించింది. వానకాలం ముగిసినా రైతులకు నయాపైసా అందలేదు. ఈ సీజన్‌కు డబ్బులు ఇవ్వడం లేదని ఇటీవల వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రకటించడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల పేరిట ఈ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేయనున్నదని రైతులు ఆందోళన చెందుతున్నారు.



సభా వేదిక

## పులి దాడి

బోథ్, అక్టోబర్ 23 : ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని బాబెర తండాకు చెందిన రైతు జాదవ్ దిలీప్‌కు చెందిన ఎద్దు బుధవారం సాయంత్రం పులి దాడిలో మృతి చెందింది. రైతుల కథనం ప్రకారం.. దిలీప్ తన పొలంలో కంది పంటకు మందు పిచికారీ చేస్తున్నాడు. మేత మేస్తున్న ఎద్దుపై అటువైపుగా వచ్చిన పులి దాడి చేసింది. గమనించిన చుట్టు పక్కల మహిళలు కేకలు వేశారు. అయినప్పటికీ పులిని ఎద్దు వదలలేదు. పూర్తిగా చంపివేసింది. చుట్టు పక్కల రైతులు కేకలు వేసి పులిని అటవీ ప్రాంతం వైపు తరమేశారు. బాబెర తండా వైపు నుంచి చింతగూడ మీదుగా రెండ్లపల్లె అటవీ ప్రాంతం వైపు పులి వెళ్లినట్లుగా పేర్కొన్నారు.

### అజ్జర్-వజ్జర్ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..



చింతగూడలో పులి అడుగులుగా భావిస్తున్న అధికారులు

బోథ్ మండలంలోని అజ్జర్-వజ్జర్ ప్రాంతంలో పులి సంచారం నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అటవీ రేంజ్ ఇన్‌చార్జి అధికారి టి.పుండలిక్ తెలిపారు. బుధవారం అజ్జర్-వజ్జర్ ప్రాంతంలో పులి ఆచుకీ కోసం వెతికారు. మహారాష్ట్ర వైపు నుంచి పులి వచ్చినట్లుగా కదిలికను బట్టి తెలుస్తున్నట్లుగా పేర్కొన్నారు. మాదుగూడ, లెండిగూడ, కేశవ్‌గూడ, జైతుగూడ, నాగుగూడ, పెద్దగూడ, చింతల్‌బోరి, గుల్లపూర్ గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. కాగా.. చింతగూడ సమీపంలో పెద్దపులి అడుగులు చూసిన గ్రామస్తులు అటవీ శాఖాధికారులు సమాచారం అందించడంతో వారు వెళ్లి నిర్ధారించే పని నిమగ్నమయ్యారు.



జగదాంబ ఆలయంలో పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయులు

## గుడిలో పాఠాలు

బేల, అక్టోబర్ 23 : మండలంలోని పీట్‌గావ్(ఎల్) గ్రామంలోని విద్యార్థులు పాఠశాలలో కాకుండా గుడికి వెళ్లి విద్యను అభ్యసిస్తున్నారు. ఈ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు 36 మంది గిరిజన విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వీరికి హరికృష్ణ అనే ఉపాధ్యాయుడు పాఠాలు బోధిస్తున్నాడు. బడి గదులు శిథిలావస్థకు చేరుకోవడంతో యేడాది క్రితం రూ.21 లక్షలు నూతన భవనం కోసం మంజూరయ్యాయి. అధికారులు, ఇంజనీర్ల పర్యవేక్షణ కరువై భవన నిర్మాణాన్ని మధ్యలోనే వదిలేశారు. గ్రామస్తులందరూ గ్రామంలోని జగదాంబ ఆలయంలో పాఠాలు బోధించాలని సంబంధిత ఉపాధ్యాయుడిని కోరారు. దాదాపు పక్షం రోజులుగా ఆలయంలోనే విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ విషయమై ఎంఈవో కోల నర్సింహులును వివరణ కోరగా.. గ్రామస్తులు, కాంట్రాక్టర్‌తో మాట్లాడినమని, రెండు రోజుల్లో పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు.



అసంపూర్తిగా ఉన్న నూతన పాఠశాల భవనం పనులు

## ట్రెయినీ కలెక్టర్లకు కరెంటు కష్టాలు

***ఆదిలాబాద్ జిల్లా తాంసి*** *మండలంలోని పొన్నారి గ్రామంలో రెండు రోజులుగా ట్రెయినీ కలెక్టర్లు పర్యటిస్తున్నారు. అదే గ్రామ పంచాయతీలో బస ఏర్పాటు చేసుకున్నారు. ఈ క్రమంలో బుధవారం దాదాపు రాత్రి 7.30 గంటల నుంచి 9 గంటల వరకు కూడా కరెంటు లేకపోవడంతో అవస్థలు పడ్డారు. ఉక్కపోత, దోమలతో సహవాసం చేశారు. వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్ వెలుతురులో గంటన్నర గడిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడారు. 'బిజిలి బరాబర్ ఆరా కి' అని గ్రామస్తులను అడిగారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కరెంట్ బాగుండేదని, క్షణకాలం కూడా పోయేది కాదని తెలిపారు.*

***- తాంసి, అక్టోబర్ 23***



కరెంటు లేకపోవడంతో చీకట్లోనే సెల్‌ఫోన్స్ చూస్తున్న ట్రెయినీ కలెక్టర్లు



టిఫిన్ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్, కలెక్టర్ రాజర్షి షా

## మహిళలు ఆర్థికంగా ఎదగాలి..

**ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా**

బోథ్, అక్టోబర్ 23 : మహిళలు ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం పొచ్చెర జలపాతం వద్ద రూ.3.50 లక్షలతో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళ శక్తి క్యాంటీన్‌ను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘాల అభివృద్ధి కోసం ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందన్నారు. అనంతరం క్యాంటిన్‌లో మహిళలతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. అంతకముందు పొచ్చెర జలపాతాన్ని నాయకులతో కలిసి సందర్శించారు. జలపాతం వద్ద నాయకులతో సరదాగా ఫొటోలు దిగారు.మండల కేంద్రంలోని వివిధ గ్రామాలకు చెందిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ 20 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీ డీఆర్డీడీఏ సాయన్న, తహసీల్దార్ సుభాష్ చందర్, ఎంపీడీవో జీవన్ రెడ్డి, ఫారెస్ట్ రేంజ్ అధికారి పండరి, ఐకేపీ బీసీఎం గంగన్న, ఏపీఎం మాధవ్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ప్రమీల పాల్గొన్నారు.



జిల్లా అటవీ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆదివాసులు

## ఆదివాసుల ధర్నా

ఎదులాపురం, అక్టోబర్ 23 : అటవీ సంపద ఆధారంగా జీవనం కొనసాగిస్తున్న కొలాం గిరిజనులను ఆదుకుని ఉపాధి కల్పించాలని కొలాం సేవా సంఘం అధ్యక్షుడు సోనేరావ్ డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అడవుల్లోకి ఆదివాసులు వెళ్లకుండా అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారని ఆరోపిస్తూ జిల్లా అటవీ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఇటీవల అడవిలోకి వెళ్లిన మహిళపై అటవీ శాఖ అధికారులు ప్రవర్తించిన తీరును ఖండించారు.

## కంటతడి పెట్టుకున్న సాంగ్వీ గ్రామస్తులు

నార్నూర్, అక్టోబర్ 23 : గాదిగూడ మండలంలోని సాంగ్వీ ప్రభుత్వ పాఠశాలలో మెస్రం శేఖర్‌బాబు 12 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నాడు. అతనికి ఇదే మండలంలోని అర్జునికి బదిలీ అయింది. బుధవారం సాంగ్వీ గ్రామం లో గ్రామస్తులు, విద్యార్థులు సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయుడిని శాలువాతో సన్మానించారు. నిస్వార్థంతో విధులు నిర్వహిస్తునే, గ్రామంలో ఎవరికైనా ఏ ఆపద వచ్చిన నేను ఉన్నానంటూ భరోసా ఇచ్చేవాడు. బదిలీపై వెళ్తున్న నేపథ్యంలో గ్రామస్తులు, విద్యార్థులు కంటతడి పెట్టుకున్నారు. ఉపాధ్యాయులు మెస్రం లింగు, గంగాధర్, బాధిరావు, విద్యార్థి సంఘం మండల ప్రధాన కార్యదర్శి పెందోర్ సంతోశ్, హన్మంత్ రావ్ పటేల్, బాపూరావ్ ఉన్నారు.




ప్రభుత్వ ఉపాధ్యాయుడు బదిలీపై వెళ్తుండగా కంటతడి పెట్టుకుంటున్న గ్రామస్తులు, విద్యార్థులు

### గవర్నర్‌తో భేటీ అయిన

## ఆర్జీయూకేటీ ఇన్‌చార్జి వీసీ

బాసర, అక్టోబర్ 23 : బాసర ఆర్జీయూకేటీ ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్ బుధవారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిశారు. ఇటీవల నియమితులైన ఉన్నత విద్యామండలి చైర్మన్, వైస్ చైర్మన్, యూనివర్సిటీల వీసీలతోపాటు ఆయన గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆర్జీయూకేటీ బాసరలో కల్పిస్తున్న వసతులు, విద్యార్థులకు అందిస్తున్న కోర్సులను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బూర వెంకటేశం, వివిధ విశ్వవిద్యాలయాల ఉపకులపతులు పాల్గొన్నారు.



గవర్నర్‌తో బాసర ఆర్జీయూకేటీ ఇన్‌చార్జి వీసీ, ఆయా యూనివర్సిటీల వీసీలు

## ఏఈవోల సస్పెన్షన్‌ను రద్దు చేయాలి

- వ్యవసాయ విస్తరణ అధికారుల డిమాండ్
- మావల రైతు వేదిక వద్ద నిరసన



మావల రైతు వేదిక వద్ద నిరసన తెలుపుతున్న ఏఈవోలు

ఆదిలాబాద్, అక్టోబర్ 23(నమస్తే తెలంగాణ) : డిజిటల్ క్రాప్ సర్వేలో భాగంగా యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోని 165 మంది వ్యవసాయ విస్తరణ అధికారుల(ఏఈవో)ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. దీనిని నిరసిస్తూ బుధవారం ఆదిలాబాద్ జిల్లాలో ఏఈవోల సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఏఈవోల సస్పెన్షన్ రద్దు చేయాలని మావల రైతు వేదిక ఎదుట వ్యవసాయ విస్తరణ అధికారులు ఆందోళన చేపట్టారు. డిజిటల్ క్రాప్ సర్వేలో భాగంగా యాప్‌ను ఏఈవోలు ఇన్‌స్టాల్ చేసుకోకపోవడం సహాయ నిరాకరణకు సంబంధించిన అంశం అని, ఇలాంటి సమయంలో తమను సస్పెండ్ చేయడం బాధాకరమని ఏఈవోలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన సర్వేలో భాగంగా ఇతర రాష్ట్రాల మాదిరి సహాయకులను నియమించడం, సర్వేను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించడం, గ్రామాల్లో చదువుకున్న యువతకు ఉపాధి కల్పించడం సర్వేలో భాగమని వారు అన్నారు. రాష్ట్రంలో సర్వేను వ్యవసాయ విస్తరణ అధికారులతో బలవంతంగా చేయిస్తున్నారని, తమను మానసికంగా వేధిస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఆందోళనలో ఏఈవోల సంఘం జిల్లా అధ్యక్షుడు కంది గంగారెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ ఆనంద్, ఏడీవోలు శంకర్, శివప్రసాద్, సాయి కుమార్, ప్రణీత, దీప్తి, మనీషా పాల్గొన్నారు.